

# టమాటో ఫైట్ ఇది ఒక ఫెస్టివలే..

ఏ దేశంలో అయినా కొన్ని పండుగలు ఆకట్టుకునేలా ఉంటాయి. భారత్‌లో హోలీ పండుగను భారతీయులు ఎంత ఘనంగా జరుపుకుంటారో తెలిసిందే. అలా టమాటో ఫెస్టివల్ అనగానే స్పెయిన్ గుర్తొస్తుంది. 'లా టొమాటినా' పేరుతో జరిగే ఈ పండుగతో అక్కడి బునోల్‌లో జరిగే సందడి అంతా ఇంతా కాదు. ఒకరిపై ఒకరు టమోటాలు విసిరి కొట్టుకుంటారు. దాని కోసం టన్నుల కొద్దీ టమోటాలు ఉపయోగిస్తారు. ఈ టమాటో యుద్ధానికి కారణమైన ఘటనను కథలు కథలుగా చెబుతారు. అందుకే ఒకటి ఈ కథ..1945లో కూరగాయల దుకాణం దగ్గర గొడవ జరిగిందని.. వాగ్వాదానికి దిగిన వారు ఒకరిపై ఒకరు టమోటాలు విసురుకున్నారని.. దీంతో ప్రపంచంలోనే అతిపెద్ద టమాటో యుద్ధం ప్రారంభమైందని అంటూ ఉంటారు.

స్పెయిన్‌లోని ప్రపంచ ప్రసిద్ధ టమాటా పండుగ 'లా టొమాటినా' నుండి ప్రేరణ పొందిన ఈ ఫెస్టివల్ అనేది హైదరాబాదీ ప్రేక్షకులకు ఒక వినూత్న అనుభవాన్ని అందించేందుకు సిద్ధమవుతుంది. అవును మీరు చదువుతోంది నిజమే. హైదరాబాద్‌లో టమాటో ఫెస్టివల్ జరగనుంది. మే11న ఉదయం 10 గంటలకు హైదరాబాద్‌లోని ఎక్స్‌పీరియం ఎకో పార్క్‌లో 160 ఎకరాల్లోఈ టమోటా ఫెస్టివల్ జరగబోతుంది. దీని కోసం ఇప్పటికే 1000 కేజీల వరకు టమోటాలను ఏర్పాటు చేస్తున్నారు.

**ఫెస్టివల్ ప్రత్యేకత**

ఈ ఫెస్టివల్ ప్రత్యేకత ఏమిటంటే, దాదాపు వేల కిలోల టమాటాలను ఒకరిపై ఒకరు విసురుతూ ప్రతి ఒక్కరూ సరదాగా ఆనందిస్తారు. టమాటాలతో పోరాటం చేయడం మాత్రమే కాదు, లైవ్ డీజే సంగీతం, నృత్య ప్రదర్శనలు, ఫుడ్ స్టాళ్లు, షాపింగ్ కోసం ఫ్లీ మార్కెట్, ఫన్ జోన్స్ వంటి అనేక ఇతర ఆకర్షణలు ఉంటాయి.

**వాడేసిన టమాటాల రీసైకిలింగ్**

ఫెస్టివల్ ముగిసిన తరువాత వాడేసిన టమాటాలను రీసైకిల్ చేసి రైతులకు ఎరువుగా అందించడానికి ఏర్పాటు చేశారు. ఇది ఒక చక్కని పర్యావరణ సంబంధిత చర్యగా మన్నించబడుతుంది. ఎందుకంటే వాడిన టమాటాలను వ్యర్థంగా తాకకుండా పునఃసంచయించడంలో భాగంగా వ్యవసాయాన్ని ప్రోత్సహించడం జరుగుతుంది.









# తొలి ఏఐ దేవత

సాధారణంగా జనాలు ఆలయాలకు వెళ్తూ ఉంటారు. వెళ్లినప్పుడు దేవుడిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేస్తారు. కోరికలూ కోరుకుంటారు. కానీ దేవుడి నుంచి ప్రత్యక్షంగా సమాధానం రావడం ఎక్కడైనా చూశారా..? ఓ ఆలయంలో దేవత భక్తులతో మాట్లాడుతుంది అంటే నమ్ముతారా..? నిజమండోయ్.. సాంకేతికత అమిత వేగంతో అభివృద్ధి చెందుతున్న ఈ కాలంలో.. భగవంతుడి దగ్గరకూ టెక్నాలజీ అడుగు పెడుతోంది. మతపరమైన అనుభవాల మీద కూడా కృత్రిమ మేధస్సు ప్రభావం చూపడం ప్రారంభమైంది. తాజాగా మలేషియాలో ఇది నిజమవుతోంది.



మలేషియాలోని ప్రసిద్ధ టియాన్హౌ ఆలయంలో భక్తులతో సంభాషించే ప్రత్యేకమైన దేవతా విగ్రహాన్ని పెట్టారు. ఇది కృత్రిమ మేధస్సుతో నడిచే "ఏఐ మజు" అనే డిజిటల్ సముద్ర దేవత రూపం. భక్తులు ఈ డిజిటల్ విగ్రహంతో మాట్లాడొచ్చు, ప్రశ్నలు అడగొచ్చు, దేనికైనా సలహాలు కోరవచ్చు. ఇది చరిత్రలోనే తొలి వినూత్న ప్రయోగంగా గుర్తింపు పొందుతోంది.

మజు అనేది సముద్ర దేవత. చైనాలో 10వ శతాబ్దంలో ఫుజియాన్ ప్రావిన్స్‌లో జన్మించిన మజు... నావికులకు రక్షక దేవతగా పేరొందారు. ఆమె మరణానంతరం దేవతగా ఆరాధించబడుతూ వచ్చారు. ఇప్పటికీ మలేషియా, చైనా, సింగపూర్, ఇండోనేషియా, థాయిలాండ్ వంటి దేశాల్లో లక్షలాది మంది మజు దేవతను పూజిస్తుంటారు. ఆమె ఆశీర్వాదాలు సముద్ర ప్రయాణికుల కోసం అత్యంత ప్రాధాన్యతగా భావిస్తారు. "ఏఐ మజు" అనే డిజిటల్ విగ్రహాన్ని ఇమాజిన్ టెక్నాలజీస్ అనే సంస్థ రూపొందించింది. ఇది స్క్రీన్ మీద ప్రత్యక్షమవుతుంది. భక్తులు డైరెక్ట్‌గా దేవతతో మాట్లాడగలుగుతారు. జీవితం గురించి సందేహాలు, దుఃఖాలు, కోరికలు, ఆశయాల గురించి అడిగితే మజు ప్రశాంతంగా సమాధానం ఇస్తుంది. ఉదాహరణకు, ఓ యువతి "నా అదృష్టం ఎలా ఉంది?" అని అడిగింది. మజు సమాధానంగా "ఇంట్లో గడిపే సమయం మీకు అదృష్టాన్ని తెచ్చిపెడుతుంది" అంటూ ఓదార్చే భాషలో చెప్పింది. ఈ ప్రయోగం ద్వారా..భవిష్యత్తులో మరిన్ని ఆలయాలు కృత్రిమ మేధస్సు, వర్చువల్ రియాలిటీ వంటి టెక్నాలజీలతో కలిపి ఆధ్యాత్మిక అనుభూతిని మరింత ప్రత్యేకంగా తీర్చిదిద్దే అవకాశం ఉంది. భక్తులు ఆలయానికి వెళ్లి కనిపించే విగ్రహాన్ని దర్శించడం కాకుండా, ఇంటి టీవీలో లేదా మొబైల్‌లో దర్శించుకునే రోజులు సుదూరం కావు.

